
# చూడముచ్చటగా గోరింటాకు పండగ



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస** ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజియన్-17 నారాయణఖేడ్ నారీ సెల్ ఆధ్వర్యంలో ఆషాఢ మాస గోరింటాకు కార్యక్రమం శ్రీ సత్యసాయి ఆలయంలో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి సతీమణి శ్రీమతి అనుపమ సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు. మహిళల ఐక్యత, సంప్రదాయాల పరిరక్షణ, సామాజిక సేవలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, ప్రముఖ మహిళలు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ నారీ సెల్ డైరెక్టర్ మధుర, రీజినల్ సెక్రటరీ శ్వేత, జాయింట్ సెక్రటరీ కరుణ దేశ్ముఖ్, లావణ్య, నారీ సెల్ సభ్యులు, ఇంపాక్ట్ సభ్యులు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని గోరింటాకు వేడుకను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఇలాంటి సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

# ఫలాంబరి దేవిగా వనదుర్గమ్మ

- **ఏడుపాయలకు పోటెత్తిన భక్తజనం.**
- **మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు.. డప్పు చప్పుళ్లు, మేళతాళాల నడుమ బోనాలు.**



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** ప్రకృతి ఒడిలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల శ్రీ వనదుర్గాభవాని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆషాఢమాసం మూడో ఆదివారం సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల ఫలాలతో ఫలాంబరి దేవి రూపంలో విశేషంగా అలంకరించగా, ఆ దివ్యమంగళ రూపాన్ని తిలకించేందుకు తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మంజీరా నది జలాలు, పంచామృతాలతో అమ్మవారికి మహాభిషేకం నిర్వహించిన అర్చకులు సహస్రనామార్చన, కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు ఘనంగా చేపట్టారు. అనంతరం ఫలాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన అమ్మవారు భక్తులకు దర్శనమివ్వగా ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మార్మోగింది.మంజీరా నది ఏడు పాయలు, చెక్డ్యామ్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు చప్పుళ్లు, మేళతాళాల నడుమ మహిళలు బోనాలు, ఒడిబియ్యం సమర్పించగా, పలువురు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జై వనదుర్గమ్మ నినాదాలతో ఏడుపాయల క్షేత్రం హోరెత్తింది.ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయగా, ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పచ్చని చెట్లు, బండరాళ్లు, గలగల పారే మంజీరా జలాల మధ్య కుటుంబ సమేతంగా వనభోజనాలు చేసిన భక్తులు ఆధ్యాత్మిక అనుభూతితో తిరుగు ప్రయాణమయ్యారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో వీరేశం తెలిపారు.

# రెండు నెలలు గడిచినా పురోగతి సాధించని జోగు సంగీత కేసు

**జోగు సంగీత కేసులో నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టాలి నవోదయ సిద్ధార్థ**



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** జోగు సంగీత హత్య కేసులో నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి నిందితులను చట్టప్రకారం కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ నవోదయ సిద్ధార్థ డిమాండ్ చేశారు. ఆదివారం కంగ్టి మండలం దెగులువాడి గ్రామాన్ని సందర్శించిన ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, జోగు సంగీత హత్య జరిగినప్పటికీ కేసు నమోదులో పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శించారని, న్యాయం కోసం పోలీస్ స్టేషన్కు వెళ్లిన ప్రతిసారి తమను భయభ్రాంతులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం గ్రామంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నవోదయ సిద్ధార్థ మాట్లాడుతూ బాధిత కుటుంబం హైదరాబాద్లోని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయడంతో వారి వినతిపై దెగులువాడికి వచ్చి పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు.జోగు సంగీత భర్త జోగు విజయ్ మే 27న ఆమె కనిపించడం లేదని కంగ్టి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు వెంటనే స్పందించలేదని ఆయన ఆరోపించారు. అనంతరం మే 29న గ్రామ శివారులో జోగు సంగీత (26) మృతదేహం ఎడమ చేయి లేకుండా లభించిందని పేర్కొన్నారు. పోస్టుమార్టం నిర్వహించినప్పటికీ ఆ నివేదికను కుటుంబ సభ్యులకు ఎందుకు అందించలేదని ప్రశ్నించారు. చట్టం అందరికీ సమానమని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు తమ సంస్థ తరపున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు, రాష్ట్ర నాయకులు డాక్టర్ ఓంప్రకాష్, కోర్ కమిటీ సభ్యులు ప్రభాకర్ , సంగారెడ్డి, మేడ్చల్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు గాల్రెడ్డి, డాక్టర్ బాబురావు, సాయిలు, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఎం.ఏ. ఖైసర్, గ్రామస్తులు విశ్వనాథ్, శంకర్ , భీమప్ప ప్రకాష్ , బాధితులు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ఈ రోడ్డు వేసింది ఎవరు.... ప్రజల కోసమా ఫార్మ్ ల్యాండ్ కోసమా



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్..** నారాయణఖేడ్ మండల పరిధిలోని అబ్బెంద గ్రామ పరిధిలోని వీర్లతాండ శివారులో స్మశాన వాటిక కోసమని నిర్మిస్తున్న రోడ్డు ప్రజల కోసమా ఫార్మ్ ల్యాండ్ కోసమా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి ఇటీవల సబ్ కలెక్టర్ ఉమా హారతి స్పందించి అధికారులు ఫీల్డ్ లోకి పంపించి రోడ్డు నిర్మాణ పనులు ఆపడంతో ఇంతకీ ఆ రోడ్డు వేస్తున్నది ఎవరని విచారణ చేపట్టారు. అసైన్డ్ భూమిలో నుంచి వేస్తున్న రోడ్డు పనులు నిలిపివేసి రైతులకు పలు సూచనలు చేశారు.ఎట్టి పరిస్థితిలో రోడ్డు వేయడానికి వీలులేదని, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు కొనసాగిస్తున్న బడాబాబుల, భూ బకాసురులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# శ్రీ మహంకాళి మందిరం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన సామూహిక బోనాల ఉత్సవం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి పులిమామిడి రాజు**

**సదాశివపేట, వాస్తవ తెలంగాణ న్యూస్ ఆగస్టు/ 2** సంగారెడ్డి జిల్లాసదాశివపేట పట్టణంలోని చాపలకేరిలో శ్రీ మహంకాళి మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక బోనాల ఊరేగింపు ఉత్సవం భక్తిశ్రద్ధల మధ్య పోతురాజుల విన్యాసాలతో, జోగిని బోనంతో యువకుల డాన్సులతో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జోగిని బోనం అందరిని అలరించింది. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ సందర్భంగా సదాశివపేట మున్సిపల్ చైర్మన్ మునిపల్లి సత్యనారాయణ, 11వ వార్డు కౌన్సిలర్ వైద్యం గోపిప్రియాంక పవన్,12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమతతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు ప్రతి సంవత్సరం ఆనవాయితీగా పులిమామిడి రాజు దంపతులు అమ్మవారికి బంగారు కళ్లతో పాటు బంగారు నుదుటి తిలకాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి సమర్పించడం విశేషంగా నిలిచింది. భక్తి పారవశ్యంతో సమర్పించిన ఈ కానుకలు భక్తుల ప్రశంసలు అందుకున్నాయిఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ



చాపలకేరిలో వెలసిన శ్రీ మహంకాళి అమ్మవారు మహిమగల దేవతగా భక్తుల విశ్వాసాన్ని చూరగొన్నారని తెలిపారుఎన్నోసంవత్సరాలుగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులుచెల్లించుకుంటున్నారని, భక్తితో కోరుకున్న కోరికలు నెరవేరుతున్నాయని అన్నారు. ప్రతి సంవత్సరం ఆదివారం నిర్వహించే బోనాల ఊరేగింపు చాపలకేరి నుండి దుర్గాభవాని ఆలయం వరకు అత్యంత వైభవంగా సాగి, అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, కౌన్సిలర్లు పులిమామిడి మమత, వైద్యం గోపి ప్రియాంక పవన్ శంకర్ గౌడ్ నర్సింలు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లూరి నాగరాజు గౌడ్, విద్యాసాగర్ రెడ్డి, కోవూరి విజయ్, షాజ్జి భాయ్, బిట్ల ప్రేమ్, లడ్డు వెంకన్నబాబు శ్రీ మహంకాళి మందిరం అధ్యక్షుడు నల్ల సుధాకర్ కార్యదర్శి శంకర్, కమిటీ సభ్యులు చాపల హన్మంతు బంటు రవి అఖిల్ క్రిష్ణ ప్రవీణ్, నరేందర్ మనోహర్ ఆనంద్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేశారు.

# సబ్ కలెక్టర్ ఆదేశాలను బేఖాతర్ రిజిస్ట్రేషన్లు చేస్తున్న తహసీల్దార్..



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్.** ప్రభుత్వ నియమాలు పేదలు ఉల్లంఘిస్తే ఒకలా చర్యలు బడాబాబులు ఉల్లంఘిస్తే చర్యలే లేవు, నిబంధనలకు,భూ చట్టాలకు లోబడి,న్యాయబద్దంగా ఉన్నటువంటి ఫార్మ్ ల్యాండ్ లను మాత్రమే రిజిస్ట్రేషన్ లు చేయాలని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఎన్.ఉమాహారతి ఆదేశాలను కాదని అక్రమంగా నాగల్గిద్దా తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి గుంటల చొప్పున ఫార్మ్ ల్యాండ్లను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.అక్రమ ఫార్మ్ ల్యాండ్ల ఏర్పాటుకు పెట్టింది పేరు నాగల్గిద్దా మండలం.తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కడ లేనన్ని ఫార్మ్ ల్యాండ్లు సుమారు 20 కంపెనీల పేర్లతో నాగల్గిద్దా మండలంలోనే వెలిశాయి.నాగల్గిద్దా మండలం కర్ణాటక, మహా రాష్ట్రాలకు సరిహద్దు మండలం. కొండలు,గుట్టలు ఎక్కువగా ఉండడం,అభివృద్ధి జరుగక పోవడం,నిరుపేద కుటుంబాలు, దొర,పటేలా అనే సాంప్రదాయ పిలుపులు మారకపోవడం, మూఢనమ్మకాలతో ఇంకా కొందరు బ్రతకడం, ఎటువంటి ఉపాధి అవకాశాలు లేకపోవడం, వ్యవసాయానికి అనుకూలమైన భూములు కాకుండా రాళ్లు,రప్పలు,కొండలు, లోయలతో కూడిన భూములు ఉండడం వల్ల చాలామంది పేదలు మధ్యవర్తుల ద్వారా తక్కువ ధరలకే హైదరాబాద్ కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులకు 2లక్షల నుండి 4 లక్షలకే భూములను అమ్ముకున్నారు. ఈవిధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు వందల ఎకరాల కొద్ది భూములను కొనుక్కొని ఫార్మ్ ల్యాండ్లుగా మార్చారు.గుంట భూమి 75,000 రూపాయల నుండి 1,50,000 రూపాయల వరకు అమ్ముతూ కోట్ల రూపాయలు సంపాదించారు. నాగల్గిద్దా మండలంతో ప్రారంభమైన ఫార్మ్ ల్యాండ్ల వ్యాపారం నేడు నారాయణఖేడ్, మనూర్, సిర్గాపూర్, కంగ్టి మండలాలలో విస్తరించాయి. ప్రస్తుతం సుమారు 4 వేల ఎకరాలకు పైగా ఫార్మ్ ల్యాండ్లు విస్తరించాయి అంటే అతిశయోక్తి కాదు.ఫార్మ్ ల్యాండ్లు రోజురోజుకు పుట్టగొడుగుల్ల పుట్టుకురావడం, కొన్ని ఫార్మ్ ల్యాండ్లలో గుంటల చొప్పున భూములను కొనుక్కున్నవారు అవి నకిలీ అని తెలిసి తహసీల్దార్ లకు,పోలీసులకు కూడా పిర్యాదు చేసిన సంఘటనలు ఉన్నాయి. కరపత్రాలలో స్విమ్మింగ్ పూల్ ఉందని,30 ఫీట్ల రోడ్లు అంటూ,కాటేజీలు, షటిల్ కోర్ట్,వాలిబాల్ కోర్ట్ అంటూ సామాజిక మాధ్యమాలలో అబద్దపు ప్రచారాలు చేయడంతో పత్రికలలో వరుస కథనాలు రావడంతో నిబంధనల ప్రకారం ఉన్నటువంటి భూములనే రిజిస్ట్రేషన్ చేయాలని,అట్లా లేనియెడల రిజిస్ట్రేషన్ లు చేయరాదనీ,రోడ్ల పక్కన గల ఫార్మ్ ల్యాండ్ల కంపెనీ పేరు బోర్డులను తొలగించాలని సబ్ కలెక్టర్ తహసీల్దార్ లు,ఎంపిడిఓలకు ఆదేశాలు జారీ చేశారు.నాగల్గిద్దా తహసీల్దార్ మాత్రం సబ్ కలెక్టర్ ఆదేశాలను తుంగలోతొక్కి ప్రతీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంటుకు ఇంతని వసూలు చేస్తూ అక్రమ ఫార్మ్ ల్యాండ్లను గుంటల చొప్పున రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.రిజిస్ట్రేషన్ ఎందుకు చేస్తున్నారు అని వివరణ అడిగితే 20 రోజుల క్రితం స్లాట్ బుక్ చేసుకున్న వాటికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేస్తున్నామని,కొత్తగా చేయడం లేదని చెబుతున్నారు.మరికొందరు రియల్టర్లు గజాల చొప్పున ప్లాట్లుగా మార్చి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.

# గుమ్మడిదలలో ఘనంగా పోచమ్మ తల్లి బోనాల పండుగ

**అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తజనం.. గుమ్మడిదలలో ఉత్సవాల సందడి**
**డప్పు చప్పుళ్లు,మద్య పోచమ్మ తల్లి బోనాల వైభవం**
**పోచమ్మ తల్లి కృప కోసం భక్తుల పోటెత్తిన రద్దీ.. గుమ్మడిదలలో బోనాల వేడుకలు**
**గుమ్మడిదలలో ఆషాఢ మాస బోనాల వేడుకలో భక్తి పారవశ్యం**



**గుమ్మడిదల,వాస్తవ తెలంగాణ న్యూస్:** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంలో గ్రామదేవత శ్రీ పోచమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.తలపై బోనాలు మోసుకుంటూ అమ్మవారికి సమర్పించడం ఆకట్టుకుంది. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువకులు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామ ప్రజలంతా సుఖశాంతులు, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.

# చిన్నారి ప్రాణాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఎల్ ఓ సి) ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు**

**టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి**



**కీసర సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/**మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ మేడ్చల్ నియోజకవర్గం, షామీర్‌పేట్ డివిజన్‌కు చెందిన నర్ల బాబు, మహాలక్ష్మి దంపతుల కుమార్తె తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి వెంటనే రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి  కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఎల్ ఓ సి) ద్వారా రూ.5,00,000 ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించారు. అనంతరం సీఎం ఎల్ఓసీ పత్రాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి  మాట్లాడుతూ, "మానవత్వానికి పెద్దపీట వేస్తూ ప్రజల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా భావించే కాంగ్రెస్ ప్రభుత్వం, ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తోంది. నా విజ్ఞప్తికి వెంటనే స్పందించి చిన్నారి చికిత్స కోసం రూ.5 లక్షల సీఎం ఎల్ఓసీ మంజూరు చేసిన రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. చిన్నారి త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నారు. "ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉండటం కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం. పేదల సంక్షేమం, ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది" అని ఆయన పేర్కొన్నారు.

# మేడ్చల్ మెట్రో కారిడార్‌ను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర




**వాస్తవ తెలంగాణ న్యూస్,** హైదరాబాద్ మెట్రో ఫేజ్ కింద మేడ్చల్ మెట్రో కారిడార్‌ను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ, మేడ్చల్ మెట్రో సాధన సమితి  (ఎం ఎం ఎస్ ఎస్) ఆదివారం జీడిమెట్లలోని గాంధీ విగ్రహం నుండి జేబీఎస్ మెట్రో హబ్ వరకు శాంతియుత పాదయాత్రను నిర్వహించింది. ఈ పాదయాత్రలో ఉత్తర హైదరాబాద్ నలుమూలల నుండి నివాసి సంక్షేమ సంఘాలు (ఆర్డబ్ల్యూఏలు), సీనియర్ సిటిజన్లు, మహిళలు, యువత, నిపుణులు మరియు మెట్రో మద్దతుదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యాత్రలో పాల్గొన్నవారు ప్లకార్డులు పట్టుకుని, భారత ప్రభుత్వం మరియు తెలంగాణ ప్రభుత్వం రెండింటినీ హైదరాబాద్ మెట్రో ఫేజ్-××, ముఖ్యంగా మేడ్చల్ కారిడార్ యొక్క ఆమోదం మరియు ప్రారంభాన్ని వేగవంతం చేయాలని కోరుతూ నినాదాలు చేశారు.  సభను ఉద్దేశించి మాట్లాడుతూ, తెలంగాణలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నివాస, పారిశ్రామిక, విద్యా, మరియు ఐటీ ప్రాంతాలలో ఉత్తర హైదరాబాద్ ఒకటిగా ఆవిర్భవించిందని, అయితే సమర్థవంతమైన ప్రజా రవాణా వ్యవస్థ లేకపోవడం వల్ల తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ, రహదారి భద్రతా సమస్యలు, కాలుష్యం, మరియు సుదీర్ఘ ప్రయాణ సమయాలను ఎదుర్కొంటోందని ఎంఎంఎస్ఎస్ ప్రతినిధులు పేర్కొన్నారు.రాజకీయ విభేదాలకు అతీతంగా వ్యవహరించి, హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు త్వరితగతిన ఆమోదం లభించి, అమలు జరిగేలా కలిసి పనిచేయాలని సమితి ఇరు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. మెట్రో అనేది రాజకీయ సమస్య కాదని, ఇది లక్షలాది మంది ప్రయాణికులకు ప్రయోజనం చేకూర్చే మరియు హైదరాబాద్ నిరంతర ఆర్థిక వృద్ధికి తోడ్పడే ఒక ప్రజా అవసరమని అది నొక్కి చెప్పింది.ఈ పాదయాత్ర ఒక నిరంతర ప్రజాస్వామ్య ఉద్యమంలో భాగమని ఎంఎంఎస్ఎస్ ప్రకటించింది. మెడ్చల్ మెట్రో కారిడార్ మొదటి పిల్లర్ నిర్మించే వరకు శాంతియుత ప్రజా అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని పునరుద్ఘాటించింది.మేడ్చల్ మెట్రో సాధన సమితి (ఎం ఎం ఎస్ ఎస్)

# రాంపల్లి డబుల్ బెడ్రూమ్ కాలనీలో ఘనంగా బోనాల మహోత్సవం



**ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ రాంపల్లి డబుల్ బెడ్రూమ్ కాలనీలోని 6,240 కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో తెలంగాణ రాంపల్లి 2దీఎఖ దేవాలయ కమిటీ నిర్వహించిన బోనాల మహోత్సవం ఈరోజు అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సుమారు 3,000 మంది భక్తులు బోనాలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. కాలనీవాసులు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు విశేష సహకారం అందించిన తెలంగాణ పోలీస్ శాఖ మరియు సీఆర్పీఎఫ్ సిబ్బందికి తెలంగాణ రాంపల్లి 2దీఎఖ దేవాలయ కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది.అలాగే రాంపల్లి డబుల్ బెడ్రూమ్ కాలనీలో నివసిస్తున్న వేలాది మంది భక్తుల ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వతంగా అమ్మవారి ఆలయం, శివాలయం, మసీదు, చర్చి నిర్మాణానికి ప్రభుత్వం తగిన స్థలాన్ని కేటాయించాలని కమిటీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసింది.రాంపల్లి డబుల్ బెడ్రూమ్ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మరియు సోషల్ మీడియా మిత్రులందరికీ కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తోంది. బోనాల మహోత్సవాన్ని విజయవంతం చేసిన ప్రతి భక్తునికి, ప్రతి కుటుంబానికి, స్వచ్ఛంద సేవకులకు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ తెలంగాణ రాంపల్లి 2దీఎఖ దేవాలయ కమిటీ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. తెలంగాణ రాంపల్లి 2దీఎఖ దేవాలయ కమిటీ తెలిపారు.

# అట్టహాసంగా కట్ట మైసమ్మ తల్లి బోనాలు పోతురాజుల విన్యాసాలు.. బోనమెత్తిన నారాయణ్ ఖేడ్



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** నారాయణఖేడ్ పట్టణ పరిధిలోని కట్ట మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో అత్యహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. బోనాల ఊరేగింపులో మహిళలు,యువతులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడాయి.పోతరాజులు చేసిన విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డీజే పాటలకు యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ కేరింతలు కొట్టారు. బోనాల వేడుకల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేయడంతో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, టీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాబు మలిశెట్టి యాదవ్ తదితరులు కట్ట మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించి, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గొల్ల కురుమ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ కురుమతో ఆలయ కమిటీ పెద్దలు,మహిళలు,యువకులు, భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# సదాశివపేటలో ఘనంగా పద్మశాలి సంఘం బోనాల  ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్







**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్ ఆగస్టు -2**సంగారెడ్డి జిల్లాసదాశివపేట పట్టణంలో ఆషాఢ మాసం సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారువేడుకల్లో మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు మోసుకుంటూ భక్తి శ్రద్ధలతో ఊరేగింపులో పాల్గొన్నారుఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రజలందరికీ అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులుభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాంపల్లి బోనాల ఉత్సవాల్లో  మంత్రి సీతక్క -- ఘన స్వాగతం పలికిన నాగారం కాంగ్రెస్ నాయకులు...



**ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్,/**మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ ఘాట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లిలో నిర్వహించిన మహంకాళి బోనాల మహోత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహోదరులు శ్రీ అనిల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కందాడి అంజిరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క కి, అనిల్ రెడ్డికి, కందాడి అంజిరెడ్డి కి నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మైపాల్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఇందిరా శోభన్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సంధ్యా రెడ్డి, నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ కిరణ్‌జ్యోతి ప్రవీణ్ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు పంగా సంతోష్, ఓం ప్రకాష్ గౌడ్, పొట్టా శ్రీశైలం, పొట్టా పర్మేశ్, పొట్టా విఘ్నేష్, పంగా శ్రీహరి, రవి  తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడుగా మదన్ మోహన్



**చౌటకూర్//వాస్తవ తెలంగాణ న్యూస్ కృష్ణ కాంత్ ప్రతినిధి ఆగస్ట్02** ఉప సర్పంచుల ఫోరం చౌటకూర్ మండల నూతన కార్యవర్గాన్ని  ఆదివారం హున్నాపూర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.మదన్ మోహన్ (వెంకటకిష్టాపూర్), ఉపాధ్యక్షుడిగా  కె.రమేశ్ (పోసానిపల్లి), వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎం.రజనీగోపాల్ (బొమ్మారెడ్డి గూడెం)లను  ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా చింత చంద్రయ్య (బద్రిగూడెం), సలహాదారులుగా నార్సింగ్ మొగులయ్యముదిరాజ్ (చక్రియాల)ను ఎన్నుకున్నారు. ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధ్యకుడు జి.వీరన్న సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు ఎం. మదన్ మోహన్ తెలిపారు. ఉప సర్పంచుల హక్కులు, విధులపై పోరాటం చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

# రాంపల్లి లో లారి డి కొట్టినా ప్రమాదం లో వ్యక్తి మృతి..



**ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ ఘాట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ ఆదివారం 02-08-2026 తేదీన రాంపల్లి ఎక్స్ రోడ్ పరిధిలోని మహీంద్ర షోరూమ్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.మృతుడు మంద నర్సింహులు, తండ్రి మాధారాములు, వయస్సు సుమారు 35 సంవత్సరాలు, వృత్తి నూవర్నైవజర్, నివాసం:ఇందిరమ్మ కాలనీ,చిర్యాల గ్రామం, కీసర మండలం, అను వ్యక్తి రోజు ఉదయం సుమారు 11.00 గంటలకు తన విధులకు హాజరుకావడానికి ఇంటి నుండి తన యొక్క బైక్  టీ ఎస్ 10 ఈ డబ్ల్యూ 5739 గల బైక్ పై బండ్లగూడ నుండి రాంపల్లి చౌరస్తా వైపు బయలుదేరాడు.మార్గమధ్యలో రాంపల్లి ఎక్స్ రోడ్ వద్ద గల మహీంద్ర షోరూమ్ సమీపానికి చేరుకోగానే, బండ్లగూడ నుండి నాగారం వైపు వెళ్తున్న ఏ పి 31 టి డి 7668 నంబర్ గల లారీ డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ అకస్మాత్తుగా కుడివైపు మళ్లించి మృతుడి మోటార్‌సైకిల్‌ను బలంగా ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో మృతుడు రోడ్డుపై ఉన్న డివైడర్‌పై పడిపోయి తలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.



# చిన్నారుల అనాధ ఆశ్రమం సాయి కొరియన్ కృషి హోమ్ అసోసియేషన్ లో యం డి మట్ట శ్రీనివాస రావు జన్మదిన వేడుకలు



**గండి మైసమ్మ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మన సంపద రియల్టర్ ఎండి మట్ట శ్రీనివాస్ రావు జన్మదిన వేడుకలు దుండిగల్ గండి మైసమ్మ పరిధిలోని చిన్నారుల అనాధ ఆశ్రమం సాయి కొరియన్ కృషి హోమ్ అసోసియేషన్ లో అసోసియేషన్ సభ్యుల ఎన్ మధుసూదనాచారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మన సంపద రియల్టర్ సభ్యులు ఎండి శ్రీనివాస్ రావు జన్మదిన వేడుకలు ఇక్కడ నిర్వహించడం వారి అదృష్టంగా బావించారు.అనాధ పిల్లల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకొని వారితో కలిసి అల్పాహారం, భోజనం చేయడం చాలా సంతృప్తిగా ఉందని కమిటీ సభ్యుల మధ్య ఎండి వ్యాక్యానించారు. ఇంతమంచి కార్యక్రమం నిర్వహించిన సభ్యులకు ధన్యవాదములు తెలియజేస్తూ టీం సభ్యులు మంచి ఉత్సాహంతో పనిచేస్తూ ముందుకు వెళ్లాలని, ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండాలని, మనస్సుకు తృప్తిగా అనిపించే మంచి పనులు చేయడంలో తన వంతు సహాయసహకారాలు ఉంటాయాని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మన సంపద రియల్టార్ యం డి మట్ట శ్రీనివాసరావు, ఎన్ మధుసూదనాచారి, యాదగిరి రమేష్, వెంకటరమణ, రాజమొగులి, శ్యామల రావు, సత్యనారాయణ, సూర్యనారాయణ, రాజేష్, మన సంపద రియల్టార్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆషాఢ బోనాలకు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డికి ఆహ్వానం



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** మెదక్ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న శ్రీ నల్ల పోచమ్మ తల్లి అమ్మవారికి నిర్వహించనున్న నవమ ఆషాఢ మాస బోనాల మహోత్సవానికి హాజరుకావాలని బిఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డిని సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సంఘం అధ్యక్షుడు చెన్న రామచంద్రం, కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. బోనాల మహోత్సవాలకు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి

**క్రమశిక్షణతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో ముందుకు సాగాలి.**
**మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు.**



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్,టౌన్ :-** క్రమశిక్షణతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి అంకిత భావంతో కృషి చేయాలని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు పిలుపునిచ్చారు. బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పరిధిలోని వివిధ మోర్చాల అధ్యక్షులకు అధికారిక నియామక పత్రాలను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నీతి, నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజల్లో పార్టీని మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలని నూతన మోర్చా అధ్యక్షులకు సూచించారు. ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని సమష్టిగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, యువ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వడ్ల జనార్ధన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు పట్లోల్ల మల్లిక, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రాములు నాయక్, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు గ్యాన్ సింగ్, జిల్లా అధికార ప్రతినిధి జనగామ మల్లారెడ్డి, జిల్లా కోశాధికారి ఆంజనేయులు గౌడ్, పోతన్ చెట్టుపల్లి బీజేపీ సర్పంచ్ పాతూరి.దయాకర్ గౌడ్, మాజీ నర్సాపూర్ రూరల్ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్, మెదక్ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నల్లపోచమ్మ తల్లి బోనాల మహోత్సవం

## జై మాత నల్లపోచమ్మ నినాదాలతో మార్మోగిన మెదక్



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** ఆషాఢ మాసం సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలో ముదిరాజ్ సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ మాత నల్లపోచమ్మ తల్లి బోనాల మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు మోసుకుంటూ “జై మాత నల్లపోచమ్మ” నినాదాల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు చప్పుళ్లు, మంగళ వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల నడుమ సాగిన బోనాల శోభాయాత్ర పట్టణ ప్రధాన వీధుల గుండా కనులపండువగా సాగింది. భక్తుల జైజై ధ్వానాలతో మెదక్



పట్టణం మార్మోగింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కటాక్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ పరిసరాలు భక్తజనంతో కిక్కిరిసిపోగా, ముదిరాజ్ సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు మహోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించి విజయవంతం చేశారు.

# గ్రామదేవతల ఉత్సవాలకు లక్ష విరాళం దేవాలయ కమిటీకి అందజేసిన చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

**గుమ్మడిదల,వాస్తవ తెలంగాణ న్యూస్:** గుమ్మడిదలలో నిర్వహించనున్న ఆషాడ మాస బోనాల పండుగ ఉత్సవాల సందర్భంగా సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి గారు గ్రామదేవతల ఉత్సవాల నిర్వహణ కోసం 1,00,000 (లక్ష రూపాయల) విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్ రెడ్డి గారికి విరాళం అందించి, బోనాల ఉత్సవాలు ఘన విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సిహెచ్. కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్యారెడ్డి, కౌన్సిలర్స్ కత్తుల రమేష్, సరెడ్డిగారిపద్మ, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, గ్రామ పెద్దలు పడమటి లక్ష్మారెడ్డి, నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి,వెంకట్ రామ్ రెడ్డి, సత్యనారాయణ, పొన్నాలశ్రీనివాస్ రెడ్డి, సదానంద రెడ్డి నరేందర్ రెడ్డి, రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సూర్యనారాయణ, ఆంజనేయులు, జయపాల్ రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.



# మేడ్చల్ కేంద్రంలో ఘనంగా బోనాల ఉత్సవాలు... భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించిన వేలాది మంది భక్తులు




**మేడ్చల్ ,వాస్తవ తెలంగాణ న్యూస్:** తెలంగాణ ఆధ్యాత్మిక సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ మేడ్చల్ పట్టణ కేంద్రంలో ఘనంగా బోనాల పండుగ నిర్వహించబడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో తలపై బోనాలు మోసుకుంటూ ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పోతురాజు విన్యాసాలు, డప్పు వాయిద్యాలు,సాంప్రదాయ కళారూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేయగా, అధికారులు ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. మేడ్చల్, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794